# చిన్నకథ: అభ్యుదయోద్యమం

కొడవటిగంటి కుటుంబరావు

సాహిత్యంలో అభ్యుదయోద్యమం బయలుదేరింది యుద్ధానికి పూర్వమే. కాని చాలాకాలం ఇది మనదేశంలో వ్యాప్తికి రాలేదు. జీవితాన్ని వాస్తవిక దృష్టితో చూసి, అర్థం చేసుకుని, సాహిత్య పరమార్థం సంఘానికంతటికీ వర్తించేటట్టు చేయటం అభ్యుదయోద్యమం ఆశయం.

ఈ ఉద్యమం తెలుగుదేశంలో కొంత వ్యాప్తి సంపాదించగానే, కొందరుదీన్ని ప్రచ్ఛన్న రాజకీయోద్యమమనీ, ఇది కమ్యూనిజం యొక్క మారురూపమనీ ప్రచారం సాగించారు. దీనికి స్థూలమైన కారణమేమిటంటే కమ్యూనిస్టు పార్టీ వారు దీనిని పూర్తిగా బలపరచటమే కాక కొంతవరకూ నిర్వహించారు కూడానూ. అభ్యుదయోద్యమంద్వారా కమ్యూనిజం బలపరచుకోవటానికి కాకపోతే వాళ్లు దీనికోసం ఎందుకు తాపత్రయపడాలి? ఆదివరలో కాంగ్రెసు దేశభక్తులు ఒక సాహిత్యంలో గాదు, ఏ కళలోనూ ఆసక్తి కనపరచలేదు. లక్షలాది ప్రజలు వాళ్ళను రాజకీయరంగంలో బలపరుస్తున్నప్పుడు, కనీసం తమ ఆదర్శాలను కళలు బలపరచాలని అయినా వాళ్ళు ఆశించలేదు.

దీనికికూడా కారణం ఉన్నది. కాంగ్రెసు వారు అవలంబించిన రాజకీయ సిద్ధాంతాలు కళారంగానికి ఒక కార్యక్రమం ఇవ్వలేదు. ఇతర రాజకీయ సిద్ధాంతాలతో పోలిస్తే కాంగ్రెసు సిద్ధాంతాలు నిజంగా విశాలమైనవే. కాని ఆ సిద్ధాంతాలు సమగ్రమైన సాంఘిక సిద్ధాంతాలు కాలేకపోయాయి.

ఈలోపం మార్క్సిజంలో లేదు. ఉన్నంతలో అది సమగ్ర సాంఘిక పరిణామవాదం. అది కేవలం విశ్వాసాలమీదనే ఆధారపడక శాస్త్ర దృక్పథంకలది. మార్క్సిజంయొక్క మూల సూత్రాలను రాజకీయాలకేకాక, శాస్త్రాలకూ, కళలకూకూడా అనువర్తింప జేయవచ్చును. ఇతర సాంఘిక సిద్ధాంతాలకన్న అది సాంఘిక పరిణామాలను ఎక్కువ వివరంగా నిర్ధారణ చేస్తుంది. అందుచేతనే అనేకమంది ప్రసిద్ధ శాస్త్రవేత్తలూ, కళాకారులూ, రాజకీయవేత్తలూ మార్క్సిజమును అవలంబించటం జరిగింది. అందుచేతనే మార్క్సిజమును అవలంబించిన రాజకీయవేత్తలు, దాన్నే అవలంబించిన కళోద్యమాన్నికూడా బలపరచటం జరిగింది.

అభ్యుదయోద్యమం మార్క్సిజము పునాదిగా గల సాహిత్యోద్యమం. దీనిద్వారా కమ్యూనిస్టులు తమ రాజకీయప్రచారం సాగించుకున్న పక్షాన, అభ్యుదయోద్యమం ప్రచ్ఛన్న రాజకీయోద్యమమని విమర్శించటానికి అవకాశం ఉండేది. కాని అటువంటిది జరగలేదు.

అభ్యుదయోద్యమం అనేకమంది కొత్త రచయితలను సృష్టించింది. (యథార్థమైన ఉద్యమానికి ఇంతకంటె మంచి రుజువులేదు.) ఈ ఉద్యమంలో సృష్టి అయిన సాహిత్యంలో నూతన సాంఘిక చైతన్యం కనిపించింది. దీనితోబాటు కందుకూరి, గురజాడ మొదలైన పాత రచయితలకు కొత్తప్రచారం వచ్చింది. ఇదంతా కమ్యూనిస్టు ప్రచారమే నన్నవాళ్లు కమ్యూనిజము గురించి గాని, సాహిత్యం గురించి గాని ఆవగింజంత కూడా జ్ఞానంలేనివాళ్లు.

ఈ సందర్భంలో జరిగిన శోచనీయమైన విషయమేమిటంటే. ఒకవంక కమ్యూనిస్టులు తమకు కొన్ని సాంఘిక విశ్వాసాలున్నవని రుజువుచేస్తూ అభ్యుదయోద్యమాన్ని బలపరుస్తూ ఉంటే, మరొకవంక పదవులలో ఉన్న మన కాంగ్రెసు నాయకులు తమ సిద్ధాంతాలలో తమకే విశ్వాసంలేనట్టు రుజువు చేసుకున్నారు. "ముందడుగు" నాటకంమీది నిషేధాన్ని వారు తొలగించకపోవటానికీ, "మా భూమి", "పాంచజన్యం" మొదలైనవి నిషేధించటానికీ కారణం అణుమాత్రమైనా లేదు.

చిన్నకథ స్వతహాగా ప్రజాజీవితానికి చాలా సన్నిహితంగా సృష్టి అయిన సాహిత్యస్వరూపం కనక అభ్యుదయోద్యమం దాని అభివృద్ధికి ఎంతో సహాయకారి. అయినప్పటికీ అభ్యుదయ కథలు రాదగినంత విరివిగా రాలేదు. దీనికి కారణం, ప్రసిద్ధంగా కథలు రాసేవారిలో యథార్థమైన మార్క్సిస్టు దృక్పథమూ, జీవితంతో పూర్తి పరిచయమూ తక్కువ. కొత్తగా రచనలు సాగించినవారికి అనుభవమూ, రచనా సామర్థ్యమూ తక్కువ. ప్రస్తుతం అభ్యుదయ కథకులకు కావలిసినది ప్రోత్సాహమూ, జీవితాన్ని గురించిన పరిజ్ఞానమూ. మన సంఘంలో అనేక వృత్తుల వారున్నారు. అతి దారుణమైన ఆర్థిక సాంఘిక సమస్యలలోపడి కుళ్లుతున్నవారున్నారు. వీరందరూ తమసాహిత్యాన్ని తాముసృష్టించుకోవాలి.

కళాసృష్టిలో ఉన్న రహస్యమేమంటే దుఃఖంతో కుమిలిపొయ్యేవాడు అశ్రుకవిత్వం రాయలేడు. తన దుఃఖాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్నప్పుడే దానికొక కళాస్వరూపం ఇవ్వటం సాధ్యమవుతుంది. జీవితాన్ని అర్థం చేసుకోవటానికి కేవల జీవితానుభవం చాలదు, కొన్ని సాంఘికసిద్ధాంతాలు కూడా అవసరం. భార్యలతో కాపరం చేసేవారందరూ దాంపత్యధర్మాలు తెలిసినవారనుకోవటం పొరపాటు. దాంపత్యధర్మాలను గురించి శాస్త్రజ్ఞానం ఉండటం అత్యవసరం. మార్క్సిస్టు భావాలు అలవరచుకుని వాటిద్వారా జీవితాన్ని అర్థంచేసుకుని, మరొకవంక రచనా సామర్థ్యం పెంపొందించుకున్నవాళ్లు ఏ వర్గానికి చెందినవాళ్ళయినా చక్కని అభ్యుదయ రచనలు సాగించే అవకాశం ఉంది.

ఒకవంక కమ్యూనిస్టులకు ఉపయోగపడుతున్నాయనే ఉద్దేశంతో మార్క్స సిద్ధాంతాలను బహిష్కరించేవారూ, మార్క్స సిద్ధాంతాలలో తప్పులు ఏరేవారూ ఆసిద్ధాంతాల స్థానే కొత్తసిద్ధాంతాలు— నిర్దుష్టమైనవీ, ఉపయోగపడేవీ—ప్రచారం చెయ్యాలి గాని కేవలమూ అభ్యుదయోద్యమాన్ని తూలనాడి ఏమీ ప్రయోజనం సాధించలేరు. ఏవో సాంఘిక సిద్ధాంతాల ఆధారంలేకుండా మన కళలూ సాహిత్యమూ అభివృద్ధి అవుతా యన్నది కేవలమూ భ్రమం.




తయారుచేయువారు :
ది మైసూర్ వెజిటబిల్ ఆయిల్ ప్రాడక్ట్స్ లిమిటెడ్, మద్రాసు